# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-3 14, అక్టోబరు, 2014

ఈ ఏడాది డిసెంబర్ నుండే తెలంగాణలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, నీటి పారుదల శాఖ కార్యదర్శి ఎస్‌కె.జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి నాగిరెడ్డి తదితరులతో సచివాలయంలో మంగళవార ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో చిన్న నీటి వనరుల చెరువులను పునరుద్ధరించే కార్యక్రమం కోసం రూపొందించిన ప్రాథమిక అంచనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. తెలంగాణకు 265 టిఎంసిల నీటిని వాడుకునే హక్కు వుందని, దీనికి అనుగుణంగా చెరువులను పునరుద్ధరించుకోవాలని చెప్పారు. తెలంగాణలోని మొత్తం 45,300 చెరువుల్లో ఏడాదికి 9,060 చెరువులను పునరుద్ధరించాలని చెప్పారు. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం డిసెంబర్‌లో ప్రారంభం అయి మే నెలాఖరు వరకు కొనసాగాలన్నారు. ముఖ్యమంత్రి నుండి మొదలు కొని పాఠశాల విద్యార్థి వరకు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొనేలా కార్యక్రమానికి రూపకల్పన చేయాలన్నారు. గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు చెరువుల్లో శ్రమదానం చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు కళారూపాలను, పాటలను తయారు చేస్తున్నామని, విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. చెరువుల పునరుద్ధరణ ద్వారానే గ్రామాల వికాసం సాధ్యమనే విషయాన్ని అందరికి అర్థం చేపించాలని ముఖ్యమంత్రి సూచించారు. చెరువుల పునరుద్ధరణతో పాటు జూరాల - పాకాల, పాలమూరు ఎత్తిపోతల పథకం, ప్రాణహిత - చేవేళ్ల లాంటి భారీ నీటి పారుదల ప్రాజెక్టులపై కూడా దృష్టి పెట్టాలని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇటు చెరువులను అభివృద్ధి చేసుకుంటూ అటు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకుంటూ నీటి పారుదల శాఖ ముందుకు పోవాలని సూచించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం